

# అమెరి'కా'లేజ్

## - లిపి మల్లాది



*అమెరికాలో కాలేజీ చదువంటే ఒకప్పుడు గగనకుసుమం, అదో ఇంద్రజాలం. గత రెండు, మూడు దశాబ్దాల్లో అమెరికాలో చదువుకోసం వస్తున్న విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరగడమే కాక, ఇండియాలో కూడా ఒక మాదిరిగా చదువుకున్న కుటుంబాల్లో దాదాపు ప్రతి ఇంటికీ కనీసం ఒకరైనా అమెరికాలో చదువుకుంటున్న పిల్లలుంటున్నారు. ఇంటర్నెట్ అరచేతిలోకొచ్చేసిన ఈ రోజుల్లో అమెరికాలో కాలేజీలు ఎలా ఉంటాయో, అక్కడ డార్మ్స్ ఎలా ఉంటాయి, స్టూడెంట్స్ జీవితాలు ఎలా ఉంటాయో... అనే విశేషాలు అతి సులువుగా తెలిసిపోతున్నట్లనిపిస్తున్నాయి. ఐనా మొదటిసారి చదువుకోసం అమెరికా వచ్చే ప్రతి విద్యార్థికీ ఎవరి అనుభవం వారిదే, ఎవరి ఇబ్బందులు వారివే, ఎవరి స్నేహాలు వారివే. ఈ నేపథ్యంలో అమెరికాలో చదుకోసం వచ్చిన ఓ సాధారణ మధ్యతరగతి అమ్మాయికి ఎదురైన సంఘటనలు, సన్నివేశాలు.. స్నేహాలు, సంతోషాలు.. సరదాలు.. వెరసి ఇవన్నీ అమెరికాలేజీ కథలు. స్వానుభవాలనూ, విన్న అనుభవాలనూ, చూసిన అనుభవాలనూ - ఆసక్తికరమైన ధారావాహికగా కౌముది పాఠకులకు అందిస్తున్నది లిపి మల్లాది. 'నా కళ్ళతో నాన్న' ధారావాహికతో కౌముది పాఠకుల అభిమానాన్ని సొంతం చేసుకున్న లిపి మల్లాది ఈ ధారావాహికతో మీకు మరింత చేరువౌతుందని ఆశిస్తూ..*

*- సంపాదకుడు*

*(క్రిందటి సంచికనుంచి కొనసాగింపు)*

**భుక్తాయాశంతో** తెలికుండానే కారులో ఓ కునుకు తీసాను. ఇల్లు చేరాక అన్నయ్య టుగో బాక్స్‌ని ఫ్రిడ్జ్‌లో పెడుతుండగా నేను కొత్త బట్టల సంచిని తీసుకుని బాత్ రూంలోకి వెళ్ళాను. అన్నయ్య 'సరిగ్గా సరిపోయింది' అన్న డ్రస్సు నా కళ్ళకి ఇంకా పొట్టిగానే కనపడింది. ఇంతలో అన్నయ్య తలుపు తట్టి "నేను స్నానం చెయ్యాలి. తొందరగా" అన్నాడు.

అన్నయ్య స్నానం పూర్తయ్యేలోగా కొన్న బట్టలన్నీ పరిచి పోగులు, గొలుసులు దేనికి ఏది సరిపోతుందో ఆలోచించాను. అన్నయ్య స్నానం పూర్తయ్యాక కొన్ని చూపించి "ఇది దీనికి సరిపోతుందా?" అడిగాను.

"నాకేం తెలుస్తుంది మీ బట్టలు, గొలుసుల గురించి?" కసురుకున్నాడు.

"బావుందో బాలేదో అర్థమౌతుంది కదా?" విసుక్కున్నాను.

"రేపు నీ ఫ్రెండ్‌కి ఫోన్ చేసి అడుగు" అసహనంగా బదులిచ్చాడు. అలిగి బుంగమూతి పెట్టాను.

"సోఫాలోంచి ఇవన్నీ తీస్తావా? లేక వాటి మీదే పడుకోవాలా?" ఎగతాళిగా అడిగాడు.

"నేను ట్రై చేద్దాం అనుకున్నా" కోపంగా అన్నాను.

"అదేంటి? ట్రయిల్ రూంలో ఏం చేసావు?" ఆశ్చర్యపోయాడు.

"ట్రయిల్ రూం వేరు. ఇంటికొచ్చాక వేసుకుని చూడరా?" దబాయించాను.

"ఒసేయ్. నీ లాజిక్ నీకైనా అర్థమైందా?" నవ్వాడు.

"నాకు బాగానే అర్థమైంది. నీకే బ్రైన్ లేదు. ఆగు, ఇప్పుడే వస్తా" వెనక్కి తిరగకుండా బాత్‌రూంలోకి వెళ్ళి ప్రతీది ట్రై చేసి అన్నయ్యకి చూపించాను. తనకి ఆసక్తిలేదని నాకు అర్థమయ్యేలా ప్రవర్తించాడు. నేను ట్రై చేసినవి అన్నయ్య ఓపికగా మడతపెట్టి నా సూట్‌కేస్ మీద పెట్టాడు. ఆ తరవాత నా ఫోన్‌లోంచి సిడ్నీ షెల్డన్ రాసిన నేకెడ్ ఫేస్ పుస్తకాన్ని ఫోటో తీయడం గమనించిన అన్నయ్య "దేనికి?" అడిగాడు.

"ఫేస్‌బుక్‌లో పెట్టడానికి. నేను చదివిన ఫస్ట్ బుక్" ఉత్సాహంగా బదులిచ్చాను.

"దానికి ప్లాట్ ఫార్మ్ ఫేస్‌బుక్ కాదు"

"మరి?"

"ఇన్‌స్టాగ్రామ్"

"నాకు అకౌంట్ లేదు"

"అదేంటీ? ఎందుకని? ఆశ్చర్యపోయాడు."

"ఏమో. ఎందుకో క్రియేట్ చెయ్యాలనిపించలేదు."

"నీ ఫ్రెండ్స్ ఉన్నారా అందులో?"

"ఉన్నారు. అడిగారు కానీ నాకే బద్ధకమేసింది."

"ఏం?"

"నాకు సరిగ్గా అర్థంకాలేదు. అందులో వాల్ ఉండదు కదా? ఎక్కడ పోస్ట్ చెయ్యాలి?"

పెద్దగా నవ్వి "అదా సంగతి. ఫోటో బ్లాగ్ లాంటిది. ఫోటోకి కేప్షన్స్ రాయచ్చు. వాడితే అలవాటౌతుంది."

నేను అంగీకరించకపోవడంతో "రేపు మాస్టర్స్‌లో చేరాక ఎన్నో కొత్త సాఫ్ట్‌వేర్స్ నేర్చుకోవాలి. ఒక చిన్న ఏప్‌కి భయపడితే ఎలా?" అడిగాడు.

"నాకేం భయంలేదు" చిరాకు పడ్డాను.

అన్నయ్య వెటకారంగా నవ్వడం చూసి గబగబా ఆవేశంతో ఏప్‌ని డౌన్‌లోడ్ చేసి ఎకౌంట్ క్రియేట్ చేసాను. ఎలా వాడాలో అన్నయ్య చూపించాడు. నా మొదటి పోస్ట్‌గా సిడ్నీ షెల్డన్ మొదటి నవల ఫోటో, దానికింద 'నెవర్ న్యూ రీడింగ్ కుడ్ బి సోమచ్ ఫన్' అని రాసాను. ఆ తరవాత నా ఫ్రెండ్స్‌కి రిక్వెస్ట్ పంపాను. అంతా పూర్తయ్యాక పడుకుందాం అంటే నిద్రపట్టలేదు.

"కాళ్ళు కాలిన పిల్లిలాగా ఏం చేస్తున్నావు?" బాల్కనీలోకి వెళ్ళబోతుండగా అన్నయ్య అడిగాడు.

"నిద్రపట్టట్లేదు" బదులిచ్చాను.

"స్లీప్ టైం టీ తాగు" సలహా ఇచ్చాడు.

"ఈ టైంకి టీ నా?"

"అది నిద్రపట్టడానికి హెల్ప్ చేస్తుంది. "ఎక్కడ ఉంది టీ బాగ్?" కెటిల్ ఆన్ చేస్తూ అడిగాను.

"ఆ కింద అరలో ఉన్నాయి. పంచదార కలపకు."

"పంచదార లేకపోతే చేదు" అంటుండగా టీ డబ్బా మీద బ్లూ బెర్రీ అని రాసుండడం చూసి "ఓ బ్లూ బెర్రీ ఫ్లేవరా? సరే" అన్నాను.

టీ తయారయ్యాక "నచ్చిందా?" అష్టావంకరలు తిరిగిన నా మొహాన్ని చూసి నవ్వుతూ అడిగాడు.

"తీపి సరిపోలేదు"

"తాగుతూ ఉంటే అలవాటైపోతుంది."

అన్నయ్యకి డిస్టర్బ్ అవ్వకుండా టీ కప్పుని, నవలని తీసుకుని బెడ్‌రూంలోకి వెళ్ళాను. టీ ఎంత తాగినా అలవాటయ్యేలా అనిపించలేదు. ప్రతి పదినిమిషాలకి ఓ గుక్క బలవంతంగా తాగాను. చివరికి వచ్చేసరికి నీళ్ళు చల్లారిపోయాయి. అడుగున ఉన్నదాంట్లో తీపి బాగా తెలిసింది. బహుశా నేను వేగంగా తాగి ఉంటే ఇలా జరిగేది కాదేమో. రేపు రాత్రి కూడా ఇలానే నిద్రపట్టకపోతే తప్పు తిరిగి చెయ్యకూడదనుకున్నాను.

ఆ తరవాత వాక్ టు రిమెంబర్‌ని తిరిగి చదవడం మొదలు పెట్టాను. సినిమాల్లో చూసినా, అమెరికాలో స్కూళ్ళు ఎలా ఉంటాయో పుస్తకంలో చదివితే అనుభూతి కొత్తగా, వేరుగా ఉంది. లేన్ డన్ మొదట్లో నచ్చకపోయినా, చదవగా చదవగా నచ్చడం మొదలైంది. ప్రీస్ట్ కూతురైన జెమే డాన్స్‌కి వెళ్ళడం గమ్మత్తుగా అనిపించింది. వాళ్ళలా నేనుంటే మా అమ్మ నాకాళ్ళు విరక్కొట్టేదని మాత్రం అర్థమైంది. టైం ఎంతయ్యిందో తెలియదు కానీ పేజీలు మాత్రం తిప్పుతూ వెళ్ళిపోయాను. జెమీ చనిపోతుందని వాళ్ళ నాన్న చెప్పినప్పుడు నా కళ్ళల్లో నీరు తిరిగాయి. వాళ్ళ నాన్న పడే వేదన, లేన్‌డన్ బాధ, జేమీ వీల్ చెయిర్‌లో ఉండడం మొదలగునవి చదివి నా కడుపు తరుక్కుపోయింది. ముందుకి వెళ్ళలేక పుస్తకాన్ని పక్కన పెట్టి కళ్ళు మూసుకున్నాను.

ఉదయం లేచాకే అర్థమైంది. ఫండ్ రైసర్‌కి నేను ఇచ్చిన వంద డాలర్లు, దూరంగా ఒక స్ట్రీట్ లైట్ నుండి వెలుగు వస్తున్న రోడ్డుమీద నడవడం, చర్చ్‌కి వెళ్ళి ప్రార్థించడం, నాటకంలో పాలు పంచుకోవడం. అన్నీ ఎ వాక్ టు రిమెంబర్ ప్రభావం వల్ల వచ్చిన కలలని, రాత్రి లేట్ అయ్యేసరికి చాలా బద్ధకంగా అనిపించింది. గది తలుపు సందుల్లోంచి వచ్చిన వెలుగు చూసి అన్నయ్య ఇంకా బయలుదేరలేదని అర్థమైంది. కనీసం ఈ రోజైనా అన్నయ్యకి బై చెప్దామని ఎంతో కష్టపడి, బద్ధకాన్ని జయించాను. తలుపు తెరిచి చూస్తే అన్నయ్యలేడు. లైట్ ఆఫ్ చెయ్యడం మర్చిపోయాడా అన్న ఆలోచన వచ్చింది కానీ ఆ కాంతి సూర్యుని ప్రభావం అని కొన్ని సెకండ్లకి తట్టించి. వెంటనే గడియారం చూసాను. టైం దాదాపు పదకొండైంది. ఇంత ఆలస్యంగా లేవడం ఇదే మొదటిసారి. మరి ఇంత మొద్దు నిద్రపోయానా అని చిరాకు కలిగింది. పొద్దున ఆలస్యంగా లేవడం వల్ల కాలేజీకి లేట్‌గా వచ్చిన వాళ్ళమీద కలిగే చిన్న చూపు నాపై కూడా కలిగింది. ఇంకా ఆలస్యం చెయ్యకుండా వెంటనే కాలకృత్యాలు పూర్తి చేసి వానేజ్ చేతిలోకి తీసుకున్నాను. అమ్మ ఈ పాటికి నిద్రపోయి ఉంటుంది. అర్ధరాత్రి ఫోన్ మోగితే ఏదో దుర్వార్త అని మొదటి రింగుకే తన మనసు సెంకిస్తుంది. అందుకని తిరిగి వానేజ్‌ని దాని స్థానంలో పెట్టేసాను.

నా సెల్ ఫోన్ తీసుకుని చూస్తే త్రివేణి నుండి రెండు మిస్డ్ కాల్స్ ఉన్నాయి. 'బిజీనా? నేను దివ్యతో ఉన్నాను' అని మెసేజ్ నాలుగు గంటల క్రితం పంపించి. వెంటనే 'లేచే ఉన్నావా?' అడిగాను.

తక్షణం 'యా కాల్ చేస్తావా?' అని బదులొచ్చింది. ఇంక ఆలస్యం చెయ్యకుండా వెంటనే ఫోన్ చేసాను.

"సారీ నిద్రపోయి ఫోన్ రింగ్ వినపడలేదు" తను ఏమీ అనకముందే చెప్పాను.

"పర్లేదు ఏం చేస్తున్నావు?"

"ఇందాకే లేచాను."

"మీకు టైం ఎంత?"

"పదకొండు దాటింది"

"ఇంత లేట్‌గా లేచావా? రాత్రి లేట్ అయిందా?"

"ఔను. నిద్రపట్టలేదని బుక్ చదువుతూ ఉండిపోయాను"

"నువు బుక్స్ ఎప్పట్నించి చదవడం స్టార్ట్ చేసావు? రాత్రి నీ ఇన్‌స్టాగ్రామ్ రిక్వెస్ట్ వచ్చింది. అందులో కూడా బుక్ ఫోటో పెట్టావు. చూసి ఆశ్చర్యపోయాను. నిజంగానే చదివావా?"

"యా. మా అన్నయ్య బలవంతం చేసి చదవమన్నాడు. కానీ నిజంగానే బావుంది తెల్సా."

"ఓ... స్టోరీ ఏంటి?"

"చాలా పెద్ద స్టోరీ. తరవాత చెప్తాలే. కుదిరితే నువ్వు కూడా చదువు. చాలా ట్విస్ట్స్ ఉన్నాయి."

"ట్విస్ట్స్ ఆ? రొమాంటిక్ కాదా?"

"కాదు. థ్రిల్లర్"

"అదేంటి? నీకవి పడవు కదా?"

"ఔను. కానీ ఈ బుక్ మాత్రం బావుంది."

"ఓ. నీకు నచ్చిందంటే ఖచ్చితంగా చదవాలి" నవ్వింది.

"ఇంతకీ దివ్యకి వీసా ఎందుకు రిజెక్ట్ అయ్యిందట?"

"తన ఫింగ ప్రింట్స్ తీసుకున్నప్పుడు సరిగ్గా రాలేదట. చూస్తే ఒక వేలు తెగుందట. అన్ని ఫింగర్స్ బావున్నప్పుడు మళ్ళీ రమ్మని పంపేసారట."

"అదేంటి? అలా చేస్తారా? నేను ఫస్ట్ టైం వింటున్నాను."

"నేను కూడా ఫస్ట్ టైం వింటున్నాను. తను చాలా కోపంగా ఉంది."

"పాపం, వీసా ఇంటర్వ్యూకని షాపింగ్ కూడా చేసింది" ఇద్దరం నవ్వాము.

"నువ్వు నిన్న షాపింగ్‌కి వెళ్ళావా?"

"యా వెళ్ళాను. కానీ ఎక్కువేం కొనలేదు."

"ఎందుకు?"

"అన్నయ్య అన్నీ ఒక జతే కొన్నాడు. ఒకటి సరిపోతుందట. అందుకని అన్నీ బ్లాక్ లేదా బ్లూ తీసుకున్నాను."

"ఓ ఔనా. మరి మేచింగ్ పోగులు కొనుక్కున్నావా?"

"యా. అవి కొన్నాడు. ఒక డ్రస్ కూడా కొన్నాడు తెల్సా? కానీ నేను వేసుకోను"

"ఏం?"

"అది చాలా పొట్టిగా ఉంది."

"పొట్టిగా ఉన్నా కొన్నాడా?" ఆశ్చర్యపోయింది.

"అదే కరెక్ట్ లెంత్ అట."

"నీది ఐ ఫోనేనా?"

"ఔను."

"అయితే నీకు ఫేస్ టైం కాల్ చెయ్యనా?"

"యా. చెయ్యి. చూపిస్తాను"

అలా వీడియో కాల్‌లో త్రివేణికి రాత్రి కొన్నవన్నీ చూపించసాగాను.

(కొనసాగింపు వచ్చే నెలలో)

Click here to share your comments on this story